# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 332 | వరంగల్ | సోమవారం, 12 అక్టోబర్ 2026 | పేజీలు: 06




# రబీలో వరి సాగు వద్దు!



ఎల్‌నినో ముప్పు.. ఆరుతడి పంటలే మేలు!

నీటి లభ్యత తగ్గే అవకాశం.. పొదుపుగా వినియోగించుకోవాలి

పామ్ తోటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచన

315 మండలాల్లో తక్కువ వర్షపాతం.. కరువు మండలాల ప్రకటనకు ప్రభుత్వం సిద్ధం



ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌లో నీటి లభ్యత తగ్గే అవకాశాలున్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నీటి వనరులపై ఒత్తిడి పెరగకుండా, అందుబాటులో ఉన్న జలాలను పొదుపుగా వినియోగించుకుంటూ ఆరుతడి, స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం మేలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 315 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే జల సంరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. - అక్షరశక్తి, హన్మకొండ

3



# తెలుగు సాహిత్యానికి పట్టాభిషేకం..!

పల్లె సీను తెలుగు భాషకు, సాహిత్యానికి నీరాజనం

ఘనంగా పల్లె సీను సహస్ర చంద్రదర్శనోత్సవం..

ఒకే వేదికపై ఐదు గ్రంథాల ఆవిష్కరణ

పల్లె సీను లాంటి గురువులు అవసరం:

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్





తెలుగు సాహిత్యానికి విశేష సేవలందిస్తూ, విభిన్న సాహిత్య ప్రక్రియలతో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత అధ్యాపకుడు పల్లె సీను నిత్య చైతన్యానికి మారుపేరని, ఆయన లాంటి గురువులు ఈ నాటి సమాజానికి, విద్యావ్యవస్థకు చాలా అవసరం అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్ అన్నారు. తెలంగాణ యాసలోని సహజత్వాన్ని, తెలుగు భాషలోని మాధుర్యాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పిన పల్లె సీను సాహిత్యం భవిష్యత్తు తరాలకు అమూల్యమైన సంపదగా నిలుస్తుందని పేర్కొన్నారు. - అక్షరశక్తి, హనుమకొండ

5

# జీవో నం. 1181 రద్దు చెయ్యాలి

**అక్షరశక్తి,వరంగల్:** జీవో నం. 1181ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 15న సీడీఎంఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ శాఖ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వక్కల రాణాసాగర్, కొత్తకొండ శ్రీనివాస్, శ్రీనివాస్, మరియు యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మహా ధర్నాకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని అందించేందుకు యూనియన్ నాయకులు ఈరోజు గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.మున్సిపల్ ఉద్యోగులు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, జీవో నం. 1181ను రద్దు చేయడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమాన్ని పరిరక్షించడం తదితర డిమాండ్ల సాధన కోసం ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా తరలివచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# 'బీసీలను అణగదొక్కుతున్నారు



**అక్షరశక్తి, జనగామ:** బీసీలను అగ్రకులాలు అణగదొక్కే కుట్రలు చేస్తున్నాయని రాష్ట్ర బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు పేర్కొన్నారు. పట్టణంలోని కెమిస్ట్ భవన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు కులగణన రాజ్యాంగబద్ధమైన హక్కుగా ఇవ్వాలన్నారు. మెజార్టీగా బీసీలు ఉన్నా ఎలాంటి ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు.ఇంటలెక్చువల్ ఫోరంలో మహిళలకు ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు.సమావేశంలో ప్రసాదొ గౌడ్,అశోక్ గౌడ్,జమాల్షరీఫ్,అభిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**అక్షరశక్తి, వరంగల్:** మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై వరంగల్‌లోని దేశాయిపేట లేబర్ అడ్డా వద్ద షీ టీమ్ ఎస్సై రామారావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది కార్మికులకు మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో టీసేఫ్ అనువర్తనాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట లేబర్ అడ్డా పెద్దమనిషి సమ్మయ్య, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గర్ల్స్ కెడెట్స్ ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపుకు ముగ్గురి ఎంపిక



**అక్షరశక్తి, వరంగల్ :** వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ఎన్సిసి పదవ తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ నుండి ముగ్గురు గర్ల్స్ క్యాడెట్స్ ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపుకు ఎంపికై వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. జూనియర్ అండర్ ఆఫీసర్ శివరాత్రి రశ్మిత, ఎం. సాయి మీనాక్షి, బి.అనూష ఉన్నారు. వీరు హైదరాబాద్ మెహిదీపట్నంలో ఆర్మీ కంటోన్మెంట్ ఏరియాలో ఆయుధాలపై ప్రత్యేక శిక్షణ, ఆయుధాల ఉపయోగం వాటి ద్వారా శత్రు శిబిరాలనేలా ఛేదించాలి భవిష్యత్తు భారతార్మీ వాటి ద్వారా సాధించిన సాధించబోయే యుద్ధ తంత్రాలపై క్యాడే ట్స్ కు శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ముండ్రాతి సదానందం,సీనియర్ కాడేట్స్ పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబరిచి బెటాలియన్ కు కళాశాలకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. హైదరాబాద్ ఆర్మీ పర్యవేక్షణలో క్యాంపు అక్టోబర్ 26 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

# భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం

- **మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**
- **ఘనంగా బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి**





**అక్షరశక్తి, హనుమకొండ :** ప్రముఖ కార్మిక నాయకులు, కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అని మాజీ ప్రభుత్వ చీఫ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండలోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులతో కలిసి వినయ్ భాస్కర్ భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భగవాన్ దాస్ భౌతికంగా దూరమై 23 ఏండ్లు గడిచినా ఆయనను నేటికీ ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన బీఆర్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అన్నారు.కార్మిక సమస్యలపై నిరంతరం కృషి చేసిన బీఆర్ భగవాన్ దాస్ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేశారని అన్నారు. ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించారని, ఆయన కాపాడిన స్థలంలోనే నేడు కాళోజీ కళాక్షేత్రం నిర్మించడం జరిగిందని చెప్పారు. కాజీపేటలోకోచ్ ఫ్యాక్టరీ స్థాపించి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పోరాడారని గుర్తు చేశారు. నగరంలో పేదల ఇండ్ల స్థలాల కోసం, గుడిసె వాసులకు పట్టాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో భగవాన్ దాస్ ఉద్యమించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎన్. రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం,ఏ శబోయిన శ్రీనివాస్, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ,బీఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్ లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్, సారంగపాణి, జర్నలిస్టు నాయకులు పివి మదన్ మోహన్, తోట సుధాకర్, బొల్లారపు సదయ్య, బొడిగె శ్రీనివాస్, ఎండి నయీం తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదులో బీఆర్ఎస్ నేతల ప్రచారం

**అక్షరశక్తి, వరంగల్:** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు ముమ్మరం చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట పరిధిలో బీఆర్ఎస్ మాజీ డివిజన్ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో అర్హులైన పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ ఫారాలు అందజేస్తూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఫాతిమా చారి, సింగారపు మధు, సాంబయ్య యాదవ్, సురేందర్, సందీప్, వినయ్, టింకు తదితరులు పాల్గొన్నారు.

# ఆకాంక్ష్ పటేల్ విజయం స్ఫూర్తిదాయకం

**కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు**



**అక్షరశక్తి, వరంగల్ :** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలో ప్రతిభ కనబరిచి కేంద్ర ప్రభుత్వ ఆదాయపు పన్నుల శాఖలో సూపరింటెండెంట్‌గా ఎంపికైన రంగశాయిపేటకు చెందిన శంకర్‌రావు, వాణి దంపతుల కుమారుడు ఆకాంక్ష్ పటేల్ విజయం స్ఫూర్తిదాయకమని కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు మండల నర్సింహరాములు అన్నారు. ఆకాంక్ష్ ఉద్యోగంలో చేరిన సందర్భంగా సోమవారం స్థానికంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహరాములు మాట్లాడుతూ నిరంతర శ్రమ, కృషి, పట్టుదలతో ఉన్నత ఉద్యోగాన్ని సాధించిన ఆకాంక్ష్ యువతకు ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామి కావాలని కోరారు. ఆకాంక్ష్‌ను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమితి న్యాయ నిర్ణేతలు కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, ఎలుగు రవికుమార్, సుంకర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**అక్షరశక్తి, నర్సంపేట :** నీరు లేక ఎండిపోతున్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట రూరల్ మండలం గురిజాల గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు రైతులతో కలిసి ఎండిపోతున్న వరి, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి మాట్లాడుతూ గ్రామంలో పలువురు రైతులు సాగునీరు అందక పంటలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులతో పంట నష్టంపై సర్వే చేయించి పరిహారం అందించాలని కోరారు. గతంలో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రైతులకు నష్ట పరిహారం అందించారని గుర్తుచేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, అల్లి రవి, మంచిక హరీష్, గజ్జి రాము తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై బైక్ స్టంట్లు చేస్తే కఠిన చర్యలు

**హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ హెచ్చరిక**

**అక్షరశక్తి, హసన్‌పర్తి:** ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా జాతీయ రహదారులపై బైక్ స్టంట్లు, రేసింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ హెచ్చరించారు. ఎస్ఆర్ యూనివర్సిటీలో అక్టోబరు 10న నిర్వహించిన 'అశ్వవేగ' మోటార్ స్పోర్ట్స్ అండ్ ఇన్నోవేషన్ క్లబ్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఎల్కాపూర్ ఎన్‌హెచ్ 563 ఔటర్ రింగ్ రోడ్డుపై కొందరు బైక్ స్టంట్లు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై బెన్ హార్ రైడర్, సూర్య తేజ, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. జాతీయ రహదారిపై అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఇతరుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పబ్లిక్ రోడ్లపై స్టంట్లు చేయడం, రేసింగ్‌లకు పాల్పడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. యువత ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రబీలో వరి సాగు వద్దు!

- ఎల్‌నినో ముప్పు.. ఆరుతడి పంటలే మేలు!
- నీటి లభ్యత తగ్గే అవకాశం.. పొదుపుగా వినియోగించుకోవాలి
- పామ్ తోటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచన
- 315 మండలాల్లో తక్కువ వర్షపాతం..
- కరువు మండలాల ప్రకటనకు ప్రభుత్వం సిద్ధం







**అక్షరశక్తి, హన్మకొండ :** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌లో నీటి లభ్యత తగ్గే అవకాశాలున్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నీటి వనరులపై ఒత్తిడి పెరగకుండా, అందుబాటులో ఉన్న జలాలను పొదుపుగా వినియోగించుకుంటూ ఆరుతడి, స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. బిందు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం మేలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 315 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే జల సంరక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**జల సంరక్షణే కీలకం**

రైతులు నీటి వనరులను కాపాడుకునేందుకు ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరుబావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా విషయంలోనూ ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా, వ్యవసాయ అవసరాలకు సరిపడా నీటి నిర్వహణ చేపట్టేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**రైతు నేస్తం ద్వారా దిశానిర్దేశం**

సోమవారం హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితర ఉన్నతాధికారులు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైతు వేదికల్లో పాల్గొన్న అధికారులు, రైతులతో మాట్లాడి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రానున్న రబీ సీజన్‌లో అనుసరించాల్సిన సాగు విధానాలు, నీటి సంరక్షణ చర్యలపై సూచనలు చేశారు. దామెర మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఆరుతడి పంటల వైపు మళ్లాలి**

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా, స్థానిక నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన ఆరుతడి, స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నీటి పొదుపు పద్ధతులను అనుసరించడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

**కరువు పరిస్థితులపై ప్రభుత్వ దృష్టి**

రాష్ట్రంలో 315 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిస్థితులను సమీక్షించిన అనంతరం ప్రభుత్వం కరువు మండలాల ప్రకటనపై చర్యలు తీసుకోనుందని తెలిపారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ జలవనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే, వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..**

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గుతున్నందున రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. రానున్న కాలంలో నీటి కొరతను అధిగమించేందుకు జల సంరక్షణ చర్యల్లో ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్పన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, డీఆర్డీవో మేన శ్రీను, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీ దేవి, ఎంపీడీవో కల్పన, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు లయన్స్ చేయూత..

**జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి.**
**కోటలో మెగా వైద్య శిబిరం.**



**అక్షరశక్తి ,ఖిలా వరంగల్:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఓరుగల్లు,లయన్స్ క్లబ్ వారియర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య మరియు కంటి పరీక్ష శిబిరం సోమవారం జరిగింది.ఖిలా వరంగల్ పడమరకోటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నందు జోన్ చైర్మన్ లయన్ అంకాల ధర్మరాజుఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఇందులో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు తమ లైన్స్ క్లబ్లు ఉచితంగా చేయూతనందిస్తున్నాయని వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సుధాకర్ రెడ్డి కోరారు. అవసరార్థులను ఆదుకునేందుకు లైన్స్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు.

లైన్స్ క్లబ్ ఆఫ్ ఓరుగల్లు మెంబర్స్ ఊరుకొండ రాజేందర్ , లయన్ జలంధర్ , లయన్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు వారితో పాటు స్థానికులు అంకాల జనార్ధన్, పోషాల నాగరాజు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. దాదాపు 200 మందికి పైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు కంటి పరీక్షలు చేయించుకున్నారు దాదాపు 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరమావు తా యని, ఆప్తల్మిక్ ఆఫీసర్లు పేర్కొన్నారు. 60 మందికి కళ్లద్దాలు అవసరమని పేర్కొన్నారు దీనికి లయన్స్ క్లబ్ వారు అందరికి ఉచితంగా ఆపరేషన్లు, కంటి అద్దాలు ఉచితంగా ఇస్తామని తెలిపినారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ముందు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యంగా జీవించాలన్నారు. మాధవ హాస్పిటల్ డాక్టర్ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ షుగర్, బిపి,ఇతర పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## ప్రైవేట్ ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**అక్షరశక్తి, హనుమకొండ :** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపీటీఎఫ్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునిల్‌కుమార్ కోరారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఖ్య, సమాజంలో వారి పాత్రను దృష్టిలో ఉంచుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలతో విసిగిపోయామని, ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే మద్దతు ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని సంస్థగా టీపీటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పనిచేస్తోందన్నారు. దసరా సెలవుల్లోనూ తరగతులు, వర్క్‌షాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పండుగ సెలవులు ఇవ్వకుండా, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే పాఠశాలలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే గుర్తింపు రద్దు చేసే వరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రజావాణి కి225 అర్జీలు

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**అక్షరశక్తి,హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో లేకుండా పరిష్కరించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 98అర్జీలను ప్రజలు అందజేయగా హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 30 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 97 అర్జీలు (మొత్తం 225) వచ్చాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదులో బీఆర్ఎస్ నేతల ప్రచారం

**అక్షరశక్తి, వరంగల్:** రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు ముమ్మరం చేశారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట పరిధిలో బీఆర్ఎస్ మాజీ డివిజన్ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో అర్హులైన పట్టభద్రులకు ఎన్‌రోల్‌మెంట్ ఫారాలు అందజేస్తూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఫాతిమా చారి, సింగారపు మధు, సాంబయ్య యాదవ్, సురేందర్, సందీప్, వినయ్, టింకు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**జిల్లా అధ్యక్షుడిగా బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల కొమురయ్య**



బేతి సతీష్ యాదవ్
TJA ములుగు జిల్లా అధ్యక్షులు

**అక్షరశక్తి, ములుగు:** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ములుగు జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకటరమణ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్. ఘోరి, రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆరిఫ్ ఖాన్ హాజరయ్యారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బేతి సతీష్ యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రం స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షులుగా చల్లగురుగుల రాజు, గంపల శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా గట్టు ప్రశాంత్, గంద్రత్ విజయాకర్, కోశాధికారిగా సంగ రంజిత్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మొలుగూరి సంపత్, దొమ్మటి వెంకటేష్, కోల కోటి, కె.ఆర్. శంకర్, ఎం.డి. చాంద్ పాషా, నూక రమేష్, తాళ్లపల్లి గోపి, వలస మధు, వాసం నారాయణ, పెండెం భిక్షపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు రాష్ట్ర నాయకత్వాన్ని శాలువాలతో సన్మానించారు. ములుగు జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## ఎన్నికల సంఘం తీరుపై 'ఇండియా' కూటమి నిరసన

**సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాకు డిమాండ్**



**అక్షరశక్తి, న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ 'ఇండియా' కూటమి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించాలని నిరసనకారులు కోరారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న నాయకులపై ఆంక్షలు విధించడం, మెట్రో సేవలను నిలిపివేయడం వంటి చర్యలు సరికావని మండిపడ్డారు. ఎన్నికల సంఘం తీరులో మార్పు వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.


## అర్థశాస్త్రంలో మాలోత్ వెంకన్న నాయక్‌కు పీహెచ్‌డీ



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి మాలోత్ వెంకన్న నాయక్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో గిరిజన మహిళల భాగస్వామ్యం-ఒక అధ్యయనం' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ట రాజేందర్ తెలిపారు. అర్థశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. స్వరూపరాణి పర్యవేక్షణలో వెంకన్న నాయక్ పరిశోధన పూర్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి పంచాయతీ పరిధిలోని భవానిగడ్డ తండాకు చెందిన వెంకన్న నాయక్‌ను విభాగాధిపతి ఆచార్య సురేష్‌లాల్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించి సన్మానించారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**ప్రజా సంక్షేమం, రైతుల అభ్యున్నతి, జల సంరక్షణతో సుస్థిర తెలంగాణ**




ప్రకృతిలో చోటుచేసుకునే వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవన విధానం, వ్యవసాయం, నీటి వనరులపై ప్రభావం చూపుతున్నాయి. అలాంటి ముఖ్యమైన సహజ వాతావరణ ప్రక్రియల్లో ఎల్‌నినో ఒకటి. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. దీని ప్రభావంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలుల కదలికల్లో మార్పులు సంభవించవచ్చు.

**వాతావరణ మార్పులపై ముందస్తు అవగాహన**

ఎల్‌నినో ప్రభావం వల్ల భారతదేశ నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉన్నప్పటికీ, ప్రతిసారీ వర్షాభావ పరిస్థితులే ఏర్పడతాయని చెప్పలేం. ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల శాస్త్రీయ అంచనాలను అనుసరిస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం ఎంతో అవసరం.


వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా నిర్వహించడం, తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేయడం, వ్యవసాయ రంగానికి తగిన సలహాలు అందించడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించుకోవచ్చు.

**రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం**

తెలంగాణ అభివృద్ధిలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు రైతులకు సవాళ్లు విసిరే అవకాశం ఉన్నందున వారికి సకాలంలో వాతావరణ సమాచారం అందించడం ముఖ్యం. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలతో పంటల ఎంపిక, సాగునీటి వినియోగం, నేలలో తేమను కాపాడే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి. డ్రిప్ ఇరిగేషన్, సూక్ష్మ సేద్యం, నీటిని పొదుపుగా వినియోగించే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలి. ప్రభుత్వ సహకారం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా అభివృద్ధి చేసుకోవచ్చు.

**నీటి సంరక్షణలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం**

నీరు జీవనానికి ఆధారం. తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలు, పర్యావరణ సమతుల్యతకు నీటి వనరులు ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు, జలాశయాల పరిరక్షణతో పాటు వర్షపు నీటి




సేకరణ, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి.

రాష్ట్ర ప్రభుత్వం, వివిధ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ నీటి నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అదే సమయంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, సామాజిక సేవా సంస్థలు కూడా నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.

ప్రతి ఇంటిలో నీటి పొదుపు, ప్రతి గ్రామంలో జల వనరుల పరిరక్షణ, ప్రతి పట్టణంలో వర్షపు నీటి నిల్వకు ప్రాధాన్యం ఇస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే నీటి వనరులను కాపాడుకోవచ్చు.

**పర్యావరణ పరిరక్షణతో సుస్థిర అభివృద్ధి**

వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణ, కాలుష్య నియంత్రణ, సహజ వనరుల బాధ్యతాయుత వినియోగం కీలకమైనవి. పాఠశాలలు, కళాశాలలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు కలిసి పర్యావరణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.

ప్రభుత్వ విధానాలు, అధికార యంత్రాంగం కృషి, రైతుల అనుభవం, శాస్త్రవేత్తల సూచనలు, ప్రజల భాగస్వామ్యం సమన్వయంతో సాగితే వాతావరణ సంబంధిత సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చు.

ఎల్‌నినో అనేది భయాందోళనలకు కారణం కావాల్సిన అంశం కాదు. ప్రకృతి వనరుల విలువను గుర్తించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన సందర్భం. శాస్త్రీయ వాతావరణ అంచనాలను అనుసరించడం, రైతులకు అండగా నిలవడం, నీటిని పొదుపుగా వినియోగించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత.

ప్రభుత్వం-ప్రజలు-రైతులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి, నీటి భద్రతకు ప్రాధాన్యం ఇస్తే సుస్థిరమైన, సుభిక్షమైన తెలంగాణ నిర్మాణానికి బలమైన పునాది ఏర్పడుతుంది. నీటిని సంరక్షిద్దాం - రైతులకు అండగా నిలుద్దాం - పచ్చని తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములమవుదాం..



- ఇ.వి.శ్రీనివాస్ రావు,
సామాజిక వేత్త

# నేటి నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- **33 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు పిలుపు**

**అక్షరశక్తి, హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం, ఉద్యోగాల క్రమబద్ధీకరణ డిమాండ్లతో అక్టోబరు 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు ఎన్‌హెచ్‌ఎం జేఏసీ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రావు పుట్ట తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు, 78 కేడర్లకు చెందిన సిబ్బంది ఈ ఉద్యమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బంది ఏళ్లుగా సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, వేతనాలు, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాలేదని జేఏసీ పేర్కొంది. ఉద్యోగులందరినీ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని, అన్ని కేడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది. పీఆర్సీ, న్యాయమైన వేతనాలు, 100 శాతం గ్రాస్ శాలరీ, ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్, అర్హులైన మహిళలకు 180 రోజుల ప్రసూతి సెలవులు, ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పించాలని కోరింది. కేడర్ల మధ్య వేతన, సేవా ప్రయోజనాల వ్యత్యాసాలను సరిచేయాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరపాలని నాయకులు కోరారు. నిరవధిక సమ్మెలో అన్ని కేడర్ల ఉద్యోగులు




ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు డాక్టర్ మహేందర్‌రావు పుట్ట, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. రుక్ముద్దీన్ ప్రకటన విడుదల చేశారు.

# తెలుగు సాహిత్యానికి పట్టాభిషేకం..!

- పల్లె సీను తెలుగు భాషకు, సాహిత్యానికి నీరాజనం
- ఘనంగా పల్లె సీను సహస్ర చంద్రదర్శనోత్సవం..
- ఒకే వేదికపై ఐదు గ్రంథాల ఆవిష్కరణ
- పల్లె సీను లాంటి గురువులు అవసరం:
- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్











**అక్షరశక్తి, హనుమకొండ:** తెలుగు సాహిత్యానికి విశేష సేవలందిస్తూ, విభిన్న సాహిత్య ప్రక్రియలతో తనదైన ముద్ర వేసుకున్న ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత అధ్యాపకుడు పల్లె సీను నిత్య చైతన్యానికి మారుపేరని, ఆయన లాంటి గురువులు ఈ నాటి సమాజానికి, విద్యావ్యవస్థకు చాలా అవసరం అని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్ అన్నారు. తెలంగాణ యాసలోని సహజత్వాన్ని, తెలుగు భాషలోని మాధుర్యాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పిన పల్లె సీను సాహిత్యం భవిష్యత్తు తరాలకు అమూల్యమైన సంపదగా నిలుస్తుందని పేర్కొన్నారు. హనుమకొండలోని హరిత ఆడిటోరియంలో ఆదివారం పల్లె సీను సహస్ర చంద్రదర్శనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీలేఖ సాహితి, వరంగల్లు స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో పల్లె సీను రచించిన ఐదు గ్రంథాలను సాహితీ ప్రముఖులు ఒకే వేదికపై ఆవిష్కరించడం విశేషం. ఈ కార్యక్రమానికి డా. రియాజ్ విశిష్ట అతిథిగా హాజరై పల్లె సీనుతో తనకున్న అనుబంధాన్ని, ఆయన సాహితీ సేవలను గుర్తుచేసుకున్నారు.



**చిన్ననాటి గురువు సాహిత్యం నాకు స్ఫూర్తి**

ఈ సందర్భంగా డా. రియాజ్ మాట్లాడుతూ, పల్లె సీను తన చిన్ననాటి గురువని, ఆయన ప్రత్యక్ష శిష్యుడిగా ఉండటం తనకు గర్వకారణమని అన్నారు. తెలుగు భాషపై తనకు మమకారం పెరగడానికి సీనయ్య సారు బోధనలే కారణమని పేర్కొన్నారు. ఎనిమిది పదుల వయస్సు దాటినా సాహిత్యంపై ఆసక్తి, రచనా వ్యాసంగంపై నిబద్ధతతో కొనసాగుతున్న పల్లె సీను ఎందరికో ఆదర్శమని కొనియాడారు.

పాల్కురికి సోమన, బమ్మెర పోతన నుంచి గద్దర్, విమలక్క, గోరటి వెంకన్న వరకు పలువురు కవుల రచనల్లో కనిపించే భాషా సహజత్వం, ప్రజల జీవన విధానానికి దగ్గరగా ఉండే వ్యక్తీకరణ పల్లె సీను సాహిత్యంలోనూ కనిపిస్తాయని అన్నారు. ఆయన రచనలు పాఠకులకు సాహిత్యంపై ఆసక్తిని పెంచడంతోపాటు, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. పల్లె సీను రచించిన గ్రంథాలను రాష్ట్రంలోని గ్రంథాలయాలకు పంపించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

**ఒకే వేదికపై ఐదు గ్రంథాల ఆవిష్కరణ...**

పల్లె సీను రచించిన నా సాహిత్య సంబంధాలు, నేను కవిత్వాన్ని, గగన తరంగాలు, మైత్రీ భావ తరంగాలు, పల్లె అంతరంగం తదితర గ్రంథాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఆయన చేసిన కృషిని ప్రతిబింబించేలా ఈ గ్రంథాలు రూపొందాయి.

నా సాహిత్య సంబంధాలు వ్యాస సంపుటిని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రియాజ్‌తో కలిసి కందుకూరి శ్రీరాములు ఆవిష్కరించారు. నేను కవిత్వాన్ని కవితా సంపుటిని ప్రముఖ కవి అయితా చంద్రయ్య ఆవిష్కరించగా, గగన తరంగాలు గ్రంథాన్ని పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి ఆవిష్కరించారు. మైత్రీ భావ తరంగాలు గ్రంథాన్ని శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం కార్యదర్శి తిరునగరి ఉదయవర్లు ఆవిష్కరించారు. పల్లె సీను అనుభవాలు, జ్ఞాపకాలను ప్రతిబింబించే పల్లె అంతరంగం గ్రంథాన్ని ప్రముఖ వైద్యురాలు, నవలా రచయిత డా. పర్చా అంజనీదేవి ఆవిష్కరించారు.

**వచన కవిత్వంలో భావానికి ప్రాధాన్యం**

ప్రముఖ కవి అయితా చంద్రయ్య మాట్లాడుతూ, మనసులోని భావాలను వచన కవిత్వం ద్వారా వ్యక్తం చేయడం సులభమే అయినప్పటికీ, ఆ భావానికి తగిన భాష జతకూడినప్పుడే కవిత్వం పాఠకులను ఆకట్టుకుంటుందని అన్నారు. పల్లె సీనుకు వచన కవిత్వంపై మంచి పట్టు ఉందని, ఆయన రచనల్లో భావ వ్యక్తీకరణతోపాటు భాషా సహజత్వం కనిపిస్తాయని తెలిపారు.

ప్రభుత్వ విద్యా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా. దహగం సాంబమూర్తి మాట్లాడుతూ, పల్లె సీను ఇప్పటివరకు 16కు పైగా విభిన్న సాహిత్య గ్రంథాలను వెలువరించారని గుర్తుచేశారు. ఆయన రచించిన రాధామాధుర్యం అద్భుతమైన గ్రంథమని పేర్కొన్నారు. ఆ రచనలోని భాషా ప్రయోగాలను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే హృదయంతో చదవాల్సి ఉంటుందని అన్నారు. పల్లె సీను ఆలోచనలు పాఠకులకు సాహిత్యంలోని లోతైన అంశాలను పరిచయం చేస్తాయని చెప్పారు.

**విభిన్న సాహితీ ప్రక్రియల్లో ప్రత్యేక ముద్ర**

ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు డా. మడత భాస్కర్ గగన తరంగాలు గ్రంథాన్ని సమీక్షిస్తూ, పల్లె సీను తెలుగు సాహిత్యంలోని పలు ప్రక్రియల్లో విశేష పాండిత్యాన్ని ప్రదర్శించారని అన్నారు. నాటికలు, నవలలు, గేయ కవితలు, గద్యకావ్యాలు, వ్యాసాలు, కథా సంపుటాలు, రేడియో ప్రసంగాలు వంటి అనేక ప్రక్రియల్లో రచనలు చేసి తెలుగు సాహిత్య రంగంపై తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఆయన ప్రతి రచనలోనూ అనుభవం, పరిశీలన, భాషపై ఉన్న పట్టుదల స్పష్టంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.

**ఆయన రచనల్లో వినయం, విధేయత...**

రచయిత, సీనియర్ పాత్రికేయుడు శంకేశ శంకర్రావు మాట్లాడుతూ, నా సాహిత్య సంబంధాలు గ్రంథంలో పల్లె సీను వ్యక్తిత్వంలోని వినయం, విధేయత, స్నేహభావం, ఆత్మీయత, సంస్కారం, సంప్రదాయాలు స్పష్టంగా ప్రతిబింబించాయని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా నిరంతరాయంగా సాహితీ కృషి చేస్తున్నప్పటికీ ఆయనలో నిబద్ధత ఏమాత్రం తగ్గలేదని ప్రశంసించారు. విభిన్న సాహిత్య ప్రక్రియలతో పాటు తనకు సాహితీ లోకంతో ఏర్పడిన అనుబంధాలను వివరించిన తీరు ఆదర్శనీయమని చెప్పారు. సాహితీ ప్రముఖుల అభినందనలు

ఈ వేడుకల్లో ఐతా చంద్రయ్య, డా. మడత భాస్కర్, కందుకూరి శ్రీరాములు, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, డా. పర్చా అంజనీదేవి, తిరునగరి ఉదయవర్లు, డా. అమ్మిన శ్రీనివాసరాజు, గుడిపాటి, వరిగొండ కాంతారావు, పల్లె నాగేశ్వరరావు, డా. ఎన్‌వీఎన్ చారి, పల్లేరు వీరాస్వామి, పూరే సత్యవాణి తదితర సాహితీ ప్రముఖులు పాల్గొని పల్లె సీను రచనలను, సాహిత్య సేవలను కొనియాడారు.

కార్యక్రమ నిర్వహణలో ఎస్. మురళీధర్, పల్లె వంశీ మోహన్, వెంకట శ్రీనివాస్, కుమారస్వామి, ఆకునూరి విద్యాదేవి, బండారు సుజాత కీలక పాత్ర పోషించారు. కార్యక్రమానికి సాహితీ మిత్రులు, అభిమానులు, భాషా అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో హరిత ఆడిటోరియం సందడిగా మారింది. పల్లె సీను సాహిత్య జీవితాన్ని, రచనా ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ నిర్వహించిన సహస్ర చంద్రదర్శనోత్సవం సాహితీ అభిమానుల కడుపు నింపింది.

**ఈ తరానికి మార్గదర్శకుడు....**

ప్రముఖ కవి, విశ్రాంత ఆచార్యులు పల్లె శీను "సహస్ర చంద్ర దర్శన వేళ సంబరం" పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం కనుల పండుగ కవులు సాహితీవేత్తలు నగర ప్రముఖులు, కుటుంబ సభ్యుల నడుమ అంగరంగ వైభవంగా ఆవిష్కరణ కార్యక్రమం ఎంతో సంతోషాన్నిచ్చిందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. నిదారంబరుడు పెద్దలు పల్లె శ్రీను రచనలు ఈ తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని సీనియర్ జర్నలిస్ట్ కవి తిరునగరి నరేందర్ అన్నారు.





GUEST COLUMN

# జంతర్‌మంతర్: ఇది ప్రజాస్వామ్యమా, పోలీసు రాజ్యమా?



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

భారత రాజధాని ఢిల్లీలో అక్టోబర్ 10న జరిగిన పరిణామాలు దేశ ప్రజాస్వామ్య చరిత్రలో తీవ్ర ఆందోళన కలిగించే ఘట్టంగా మిగిలిపోతాయి. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వినియోగించుకుంటూ శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చిన యువతను స్వాగతించాల్సిన ప్రభుత్వం, వేలాది మంది పోలీసులను, కేంద్ర భద్రతా బలగాలను మోహరించి, రాజధానిని నిర్బంధాల నగరంగా మార్చడం దేనికి సంకేతం? ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తున్న యువతను వినడానికి సిద్ధపడలేని ప్రభుత్వం, వారి గొంతును అడ్డుకోవడానికి ఇంతటి శక్తిని ఎందుకు వినియోగించింది? ఇది శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పౌర హక్కులను కుదించే ప్రమాదకరమైన అధికార ధోరణి కాదా?

రాయిటర్స్ నివేదిక ప్రకారం, అక్టోబర్ 10న ఢిల్లీలో రెండు వేల మందికి పైగా నిరసనకారులను నిర్బంధించారు. మరుసటి రోజు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందుస్తాన్ టైమ్స్ నివేదికలు నగరవ్యాప్తంగా సుమారు ఏడు వేల మంది నిర్బంధానికి గురైనట్లు పేర్కొన్నాయి. రెండు రోజుల వార్తలను కలిపి చూడకుండా, ఈ సంఖ్యలు ఏ సమయానికి, ఏ పరిధికి సంబంధించినవో గుర్తించాలి. అయినప్పటికీ వేలాది మందిని అదుపులోకి తీసుకున్న స్థాయిలో పోలీసు చర్యలు జరిగాయన్నది వివాదాస్పదం కాదు. సుమారు 41 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు కూడా వార్తలు వచ్చాయి. కేంద్ర ఢిల్లీలో మెట్రో స్టేషన్లు మూసివేయడం, మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేయడం, మార్కెట్లను మూసివేయడం, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం వంటి చర్యలతో దేశ రాజధాని సాధారణ జీవనాన్ని స్తంభింపజేశారు. శాంతియుత నిరసనను అడ్డుకోవడానికి మొత్తం నగరాన్ని ఎందుకు శిక్షించాలి? ఈ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఢిల్లీకి వచ్చిన విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ వార్తాసంస్థలు నివేదించాయి. ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తదితరులు కూడా వివిధ ప్రాంతాల్లో నిర్బంధానికి గురైనట్లు వార్తలు వచ్చాయి. రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్, ఇతర ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి సంఘాల కార్యకర్తలు, జర్నలిస్టులు కూడా పోలీసు చర్యలను ఎదుర్కొన్నారు. వీరిలో పలువురిని తరువాత విడుదల చేశారు. కానీ విడుదలయ్యారనే కారణంతో నిర్బంధం న్యాయబద్ధమైపోదు. ఒక వ్యక్తిని ఏ చట్టం కింద, ఏ ఆధారంతో అదుపులోకి తీసుకున్నారన్నది ముఖ్యం.

నిరసనకారులను బస్సుల్లోకి బలవంతంగా ఎక్కించి తరలించడం, వారిని వెంబడించడం, వృద్ధులను ఈడ్చుకెళ్లడం, మహిళలు, విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరించడం వంటి దృశ్యాలు వార్తా కథనాల్లో, సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చాయి. విద్యార్థులు, మహిళలపై దాడి జరిగినట్లు కనిపించే వైరల్ వీడియోకు సంబంధించి నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసినట్లు అక్టోబర్ 11న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఆ వీడియోలో కనిపించిన ప్రతి వ్యక్తి ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేశాడని ఆధారాలు లేకుండా చెప్పలేం. కానీ పౌరులను కొడుతున్నట్లు కనిపించే దృశ్యాలు నిజమైతే, దాడి చేసిన వారి రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా చట్టం తన పని చేయాలి. పోలీసు యూనిఫాం వేసుకున్నా, పౌర దుస్తుల్లో ఉన్నా, అధికారిక విధుల్లో ఉన్నా, ఎవరూ చట్టానికి అతీతులు కారు. నిరసనకారులపై దాడులు జరిగాయనే ఆరోపణలను కొట్టిపారేయకుండా, వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికల ఆధారంగా నిష్పాక్షిక విచారణ జరపాలి.

గాంధీ చూపిన శాంతియుత నిరసన మార్గమే భారత స్వాతంత్ర్య పోరాటానికి నైతిక శక్తిని అందించింది. బ్రిటిష్ పాలకులు నిరసనలను అణచివేయడానికి ఉపయోగించిన బలప్రయోగం చివరకు వారి పాలనకు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహాన్ని పెంచింది. 1919 జలియన్‌వాలాబాగ్ మారణకాండలో జనరల్ డయ్యర్ నిరాయుధ ప్రజలపై కాల్పులు జరిపించిన సంఘటన భారత చరిత్రలో చెరగని మచ్చగా మిగిలింది. నేటి ఢిల్లీ ఘటనలను ఆ మారణకాండతో సమానంగా చూడలేం. అయితే ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి బదులుగా నిర్బంధాన్ని ఆశ్రయించే అధికార ధోరణి ఎటువంటి ప్రమాదాలకు దారితీస్తుందో చరిత్ర హెచ్చరిస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులకు అధికారం ఇచ్చేవారు; వారు పాలకుల అనుమతితోనే ప్రశ్నలు అడగాల్సిన బానిసలు కారు.

రాజ్యాంగంలోని 19వ అధికరణం భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును పౌరులకు కల్పిస్తుంది. ఈ హక్కులకు ప్రజా శాంతి పరిరక్షణ వంటి కారణాలతో సహేతుకమైన పరిమితులు విధించవచ్చు. కానీ ఆ పేరుతో అన్ని నిరసనలను ముందుగానే అణచివేయడం, ప్రజలు సమావేశమయ్యే మార్గాలన్నీ మూసివేయడం, నిరసనకు వెళ్లే వారిని గుంపులుగా అదుపులోకి తీసుకోవడం సమంజసమని చెప్పలేం. ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించామని, శాంతిభద్రతలను కాపాడటానికే చర్యలు తీసుకున్నామని చెబుతున్నారు. నిరసనకారులలో ఎవరైనా హింసకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కానీ కొందరు హద్దులు దాటితే అందరినీ నేరస్థులుగా చూడటం న్యాయం కాదు. పోలీసు చర్యలు అవసరమైనవేనా, అనుపాతంలో ఉన్నాయా, తక్కువ నిర్బంధంతో పరిస్థితిని నియంత్రించే అవకాశం ఉందా అన్నది పరిశీలించాలి.

ఈ నిరసనకు మూలమైన సమస్యను కూడా ప్రభుత్వం తప్పించుకోలేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై సమాధానాలు ఇవ్వాలని యువత డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల సవరణలో సుమారు 13 కోట్ల నమోదులు తొలగించబడినట్లు రాయిటర్స్ నివేదించింది. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం, వారిలో సుమారు 6.3 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలిపోయినవారు, మూడు కోట్ల మంది ఆచూకీ తెలియనివారు, 2.8 కోట్ల మంది మరణించినవారిగా గుర్తించినట్లు పేర్కొంది. మిగిలిన నమోదులకు సంబంధించిన వివరాలు, అర్హులైన ఓటర్లు పొరపాటున తొలగించబడ్డారా అన్నది కూడా స్పష్టంగా వెల్లడించాలి. ఎన్నికల సంఘం, బీజేపీ అక్రమాలకు సంబంధించిన ఆరోపణలను ఖండిస్తున్నాయి. ఆ వాదనలను కూడా పరిశీలించాలి. కానీ ఇంత పెద్ద సంఖ్యలో నమోదులు తొలగించబడినప్పుడు ప్రతి రాష్ట్రానికి సంబంధించిన గణాంకాలు, కారణాలు, అభ్యంతరాల పరిష్కారం, తిరిగి నమోదు చేసుకున్న వారి వివరాలను బహిరంగపరచడం తప్పనిసరి. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అర్హుడైన ఒక్క పౌరుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై ప్రజలకు అనుమానాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయడం దాని బాధ్యత. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను విమర్శించడం నేరం కాదు; రాజీనామా కోరడం కూడా ప్రజాస్వామ్య రాజకీయ నిరసనలో భాగమే. అయితే ఆరోపణలతోనే ఎవరినీ దోషిగా నిర్ణయించలేం. అందుకే స్వతంత్ర పరిశీలన, పారదర్శక సమాచారం, సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ అవసరం. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రధాన ఎన్నికల కమిషనర్ మాత్రమే కాదు; ఎన్నికల సంఘం స్వతంత్రతను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం కూడా.

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ నాయకత్వం తమపై వచ్చిన విమర్శలను రాజకీయ కుట్రగా కొట్టిపారేయకుండా, రాజధానిలో చేపట్టిన చర్యలకు బాధ్యత వహించాలి. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను సమర్థించే వారు కూడా ప్రజాస్వామ్య హక్కుల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించకూడదు. తమకు అనుకూలమైన నిరసనలకు స్వేచ్ఛ, ప్రభుత్వాన్ని ప్రశ్నించే నిరసనలకు నిర్బంధం అనే విధానం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ప్రతిపక్షాల వాదనలు తప్పయితే ఆధారాలతో ఖండించాలి. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు లేవని ప్రభుత్వం నమ్మితే, స్వతంత్ర పరిశీలనకు భయపడాల్సిన అవసరం ఏముంది?

అత్యంత కీలకమైన బాధ్యత ఇప్పుడు సుప్రీం కోర్టుపై ఉంది. నిరసన హక్కును కాపాడటం, నిర్బంధాల చట్టబద్ధతను పరిశీలించడం, పోలీసు దుర్వినియోగంపై విచారణకు ఆదేశించడం, పౌరుల ప్రాథమిక హక్కులను పునరుద్ధరించడం వంటి అంశాలపై న్యాయస్థానం చురుకుగా వ్యవహరించాలి. నిర్బంధంలో ఉన్న ప్రతి వ్యక్తి వివరాలను వెల్లడించాలి. చట్టబద్ధమైన కారణం లేని నిర్బంధాలను వెంటనే ముగించాలి. అరెస్టు చేసిన వారందరినీ తక్షణమే విడుదల చేయాలి; నిర్దిష్ట నేరారోపణలు ఉన్నవారిపై మాత్రమే న్యాయబద్ధమైన ప్రక్రియ కొనసాగాలి. నిరసనకారులపై దాడుల ఆరోపణలను స్వతంత్రంగా విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. జర్నలిస్టులు తమ విధులను నిర్వర్తించేందుకు ఆటంకం కలగకుండా చూడాలి.

శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ప్రజల అసంతృప్తి తీవ్ర రాజకీయ సంక్షోభాలకు దారితీసిన పరిణామాలను భారత్ నిర్లక్ష్యం చేయకూడదు. ఆ దేశాల పరిస్థితులు భారతదేశంలో తప్పక పునరావృతమవుతాయని చెప్పడం బాధ్యతారాహిత్యం. కానీ ప్రజల గొంతును నిరంతరం అణచివేయడం, యువత ప్రశ్నలను అవమానించడం, రాజ్యాంగ సంస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీయడం ప్రమాదకరమైన పరిణామాలకు దారితీయవచ్చు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రజలను భయపెట్టడం కాదు, వారి విశ్వాసాన్ని గెలుచుకోవడం అవసరం.

జంతర్‌మంతర్ వద్ద యువత లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. నిర్బంధాలను సమర్థించుకోవడానికి బదులుగా ప్రభుత్వం తన చర్యలకు వివరణ ఇవ్వాలి. మోదీ ప్రభుత్వం, అమిత్ షా నేతృత్వంలోని హోంశాఖ, ఢిల్లీ పోలీసు యంత్రాంగం రాజ్యాంగబద్ధమైన బాధ్యతను గుర్తించాలి. తప్పు చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి. చట్టవిరుద్ధంగా నిర్బంధించిన వారిని విడుదల చేయాలి. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలపై పూర్తి పారదర్శకత పాటించాలి. సుప్రీంకోర్టు ప్రజల హక్కులకు అండగా నిలవాలి.

ప్రజాస్వామ్యం అంటే పాలకులు చెప్పింది ప్రజలు వినడం మాత్రమే కాదు; ప్రజలు అడిగినప్పుడు పాలకులు సమాధానం చెప్పడం కూడా. యువత గొంతును లాఠీలతో అణచివేయవచ్చని భావించే ఏ ప్రభుత్వమైనా చరిత్ర ఇచ్చే హెచ్చరికను గుర్తుంచుకోవాలి. అధికారం శాశ్వతం కాదు; రాజ్యాంగం, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువలే దేశానికి శాశ్వత పునాది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.